

రెండు తలల దూడ

రెండు తలలతో లేగదూడ

ముళబాగిలు, ఏప్రిల్ 12(ఆంధ్రజ్యోతి): రెండు తలలు, నాలుగు కన్నులు, రెండు చెవులతో పుట్టిన లేగదూడను అందరూ ఆసక్తిగా పరిశీలించారు. కోలారు జిల్లా ముళబాగిలు తాలూకా ఆవణి హోబళి రామసంద్ర గ్రామం రైతు ఎల్లప్పకు చెందిన ఆవు శనివారం ఈ లేగ దూడకు జన్మనిచ్చింది. ఆవు, దూడ రెండూ ఆరోగ్యంగా ఉన్నాయని రైతు తెలిపారు.



అలంకరణలో అభయాంజనేయస్వామి

అంగరంగ వైభవంగా

హనుమాన్ జయంతి

రాష్ట్రవ్యాప్తంగా హనుమాన్ జయంతి వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. ఆంజనేయ స్వామి ఆలయాలను విద్యుత్ దీపాలు, రకరకాల పూలతో అలంకరించి భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. హనుమంతుడి జన్మస్థలం అయిన అంజనాద్రి కొండ భక్తులతో కిక్కిరిసిపోయింది. ⑨



భక్తులతో కిటకిటలాడుతున్న అంజనాద్రి



డబుల్.. ట్రబుల్..!

- రెండో విమానాశ్రయానికి జోరుగా కసరత్తు
- మా జిల్లాకు అంటే మా జిల్లాకు అంటున్న మంత్రులు
- నేతల మధ్య విభేదాలు.. ఉత్తర కర్ణాటకలో పెరిగిన డిమాండ్
- ఏఐ సాంకేతికతతో పూర్తయిన సర్వే



బెంగళూరు అంతర్జాతీయ విమానాశ్రయం



మంత్రి ఎంబీ పాటిల్‌తో సమావేశమైన అధికారులు (ఫైల్)

బెంగళూరు, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): బెంగళూరుకు అనుబంధంగా రెండో విమానాశ్రయం ఏర్పాటు మంత్రుల మధ్య విబేధాలు, ప్రాంతాల పరిశీలన వంటి సంఘటనలతో చర్చనీయాంశమైంది. దేవనహళ్ళిలోని కెంపేగౌడ అంతర్జాతీయ విమానాశ్రయానికి ప్రయాణీకుల సంఖ్య ఏటా పెరుగుతుండడం, సరుకు రవాణాలోనూ రికార్డులు నమోదు కావడంతో ఆరు నెలల క్రిందట భారీ పరిశ్రమలశాఖ మంత్రి ఎంబీ పాటిల్ రెండో విమానాశ్రయం ఏర్పాటు ప్రస్తావన తీసుకొచ్చారు. ఆ తర్వాత కేబినెట్‌లో చర్చ, అనంతరం ఎయిర్‌పోర్ట్ అథారిటీకి వినతులు పంపారు. ఇదే సందర్భంలోనే బెంగళూరు నగరానికి అనుబంధంగా తమిళనాడు రాష్ట్రం చివరి పట్టణం హోసూరుకు సంబంధంగా విమానాశ్రయం ఏర్పాటుకు ప్రయత్నించారు. ఎయిర్‌పోర్ట్ అథారిటీకీ తమిళనాడు ప్రభుత్వం వినతులు పంపింది. ప్రస్తుతం దేవనహళ్ళిలోని ఎయిర్‌పోర్ట్ కాంట్రాక్టు మరో పదేళ్లదాకా ఉంది. కొత్తగా ఎయిర్‌పోర్ట్ నిర్మించాలన్నా కనీసం 8 ఏళ్లకుపైగా గడువు తప్పనిసరి కానుంది.



కనకపుర ప్రాంతంలో విమానాశ్రయం కోసం పరిశీలించిన ప్రదేశం

మంత్రుల మధ్య పెరిగిన పోటీ

ఇలా బెంగళూరుకు రెండో విమానాశ్రయం అవసరమనేది ఖరారు కావడంతో మంత్రులు ఎవరికి వారు తమ ప్రాంతంలో ఏర్పాటు చేసుకోవాలని పోటీ పడుతున్నారు. తుమకూరు జిల్లా శిర పరిధిలో ఎయిర్‌పోర్ట్ ద్వారా జాతీయ రహదారి అనుబంధం, ఉత్తరకర్ణాటక జిల్లాలకు అనుకూలత కానుందని హోం మంత్రి పరమేశ్వర్ ప్రతిపాదించారు. అందుకు సహకారశాఖ మంత్రి రాజణ్ణ, ఢిల్లీలో అధికార ప్రతినిధి టీబీ జయచంద్రలు అభిప్రాయపడ్డారు. అయితే కనకపుర ప్రాంతంలో ఏర్పాటు చేయాలని డీసీఎం డీకే శివకుమార్ ప్రతిపాదించారు. కనకపుర రోడ్డు లేదా నెలమంగల ప్రాంతంలో ఏర్పాటు చేయాలని డీసీఎం ఆలోచనగా ఉంది. ఈ రెండు ప్రాంతాల్లో ఏర్పాటుకు ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతులు ఇవ్వరాదని 30మంది ఎమ్మెల్యేలు ముఖ్యమంత్రికి లిఖితపూర్వకంగా కోరారు. ఉత్తర కర్ణాటకకు చెందిన ఎమ్మెల్యేలు అత్యధికంగా ఉన్నట్టు తెలుస్తోంది. వీరంతా శిర ప్రాంతానికి వత్తాసు పలుకుతున్నారు.

పలు ప్రాంతాల పరిశీలన

ఎయిర్‌పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఏఏఐ) అధికారులు రెండు రోజులపాటు వివిధ ప్రాంతాలను పరిశీలించారు. నెలమంగల, కుణిగల్ ప్రాంతాలను వారు సందర్శించడం ద్వారా బిడదికి ఎయిర్‌పోర్ట్ రాదనే ప్రచారం సాగింది. ఎయిర్‌పోర్ట్ ఏర్పాటైతే ఈ ప్రాంత అభివృద్ధితోపాటు ఉపాధి సాధ్యం కానుందనేది నాయకుల ఆలోచనగా ఉంది. దేవనహళ్ళిలో ఎయిర్‌పోర్ట్ ఏర్పాటు తర్వాత ఈప్రాంత భూములు భారీ ధర పలికాయి. 10లక్షల విలువ చేయని భూములు ఏకంగా రూ.10కోట్ల స్థాయికి చేరాయి.

దేవనహళ్ళి ఎయిర్‌పోర్ట్‌కు భారీ డిమాండ్

దేవనహళ్ళి ఎయిర్‌పోర్ట్ ప్రారంభమై దశాబ్దన్నరకాలమైంది. దేశంలోనే ప్రముఖ విమానాశ్రయాల్లో మూడోదిగా నిలిచింది. ఆదాయంలోనూ వందల కోట్లకు చేరింది. 2024-25 ఆర్థిక సంవత్సరంలో 41.88 మిలియన్లమంది ప్రయాణించారు. 5లక్షల మెట్రిక్ టన్నుల సరుకు రవాణా సాధ్యమైంది. అంతకుముందు ఏడాదితో పోలిస్తే 11.6శాతం ప్రగతి సాధించింది. 2023-24లో 37.53 మిలియన్లమంది ప్రయాణించగా ఏడాదిలోనే 41.88 మిలియన్లకు చేరింది. దేశీయ విమానాలతోపాటు అంతర్జాతీయ విమానాల సంఖ్య భారీగా పెరిగాయి. ఇక్కడి రెండో టర్మినల్ ప్రపంచంలోనే ప్రముఖమైనదిగా గుర్తింపు పొందింది.



ప్లకార్డులతో కేంద్రమంత్రి కుమారస్వామి

కాంగ్రెస్ రౌడీలకు

భయపడేది లేదు

- కేంద్రమంత్రి కుమారస్వామి
- ఫ్రీడం పార్కులో జేడీఎస్ నిరసన

బెంగళూరు, ఏప్రిల్ 12(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ రౌడీలకు భయపడేది లేదని కేంద్రమంత్రి కుమారస్వామి అన్నారు. జేడీఎస్ యువ విభాగం అధ్యక్షుడు నిఖిల్ కుమారస్వామి నేతృత్వంలో శనివారం ఫ్రీడంపార్కులో 'సాకప్ప సాకు కాంగ్రెస్ సర్కార' పేరుతో చేపట్టిన నిరసనలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా కుమారస్వామి మాట్లాడుతూ తనకు వ్యతిరేకంగా ఆందోళన చేసి లారీల్లో రికార్డులు తీసుకొస్తామని కొందరు చెబుతున్నారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏ స్థాయిలో అవినీతికి పాల్పడిందో రికార్డులతోపాటు ప్రజలకు వివరిస్తానన్నారు. కాంగ్రెస్ రౌడీలకు భయపడేది లేదన్నారు. తనపై గనుల అక్రమాల ఆరోపణలు చేస్తున్నారన్నారు. కానీ సీఎం సిద్దరామయ్య చుట్టే గనుల కిక్‌బ్యాక్ ఆరోపణలు వచ్చాయన్నారు. తన వద్ద ఆధారాలు టన్నులకొద్దీ ఉన్నాయనేది వాస్తవమన్నారు. న్యాయం, కోర్టు ఉందని, పోరాటం చేస్తున్నానన్నారు. తనను టార్గెట్ చేసుకుని వేధించాలని కాంగ్రెస్ కుట్ర పన్నుతోందన్నారు. జేడీఎస్ కార్యకర్తలు ఎవరికీ లొంగేవారు కాదన్నారు. ప్రతిపక్షాలను తొక్కిపెట్టేందుకు రాజకీయాలు చేస్తున్నారన్నారు. తాను కేంద్రమంత్రిగా కొనసాగుతున్నా రాష్ట్రంలో కార్యకర్తల కోసం నిరంతరం ఆలోచిస్తానన్నారు. రెండేళ్ల కాంగ్రెస్ పాలనలో అత్యంత అవినీతి సాగుతోందన్నారు. ధరల పెరుగుదలకు హద్దూ అదుపు లేకుండా పోయిందన్నారు. కాంగ్రెస్ వారే అవినీతిలో నెంబరు వన్ అని చెప్పుకొంటున్నారన్నారు. ప్రతిరోజూ ధరలు పెంచి సామాన్యులకు ఇబ్బంది పెడుతున్నారన్నారు. నిఖిల్ కుమారస్వామి మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై పోరాటం నిలిపే ప్రసక్తే లేదన్నారు.



కరగకు పూజలు చేస్తున్న అర్చకులు



అమ్మవారి దర్శనానికి క్యూలో ఉన్న భక్తులు

ఉత్సాహంగా కరగ

- శోభాయమానంగా నగర వీధులు
- సీఎం, డీసీఎంలకు ఆశీర్వాదాలు

బెంగళూరు, ఏప్రిల్ 12(ఆంధ్రజ్యోతి): ఎనిమిది శతాబ్దాల చరిత్ర కల్గిన బెంగళూరు కరగ ఉత్సవం ఉత్సాహంగా సాగుతోంది. నగరత్‌పేట ధర్మరాయస్వామి ఆలయానికి వేలాది మంది భక్తులు తరలివచ్చారు. శనివారం ఉదయం నుంచే ప్రత్యేక పూజలు, సంప్రదాయాలు కొనసాగాయి. సాయంత్రం అయ్యేసరికి కార్పొరేషన్ నుంచి మార్కెట్, అవెన్యూరోడ్డు, బీటీఎంపీ ప్రాంతాలంతా భక్తులతో సందడి అయ్యింది. రాత్రి 9 గంటలనుంచి ధర్మరాయస్వామి ఆలయంలో పూజలు కొనసాగాయి. రాత్రి 12 గంటలకు రథోత్సవం, ఆ తర్వాత ఆలయం నుంచి అర్చకుడు జ్ఞానేంద్ర కరగను మోసుకుని బయల్దేరారు. సీఎం, డీసీఎంలకు ఆశీస్సులు అందించి నగర వీధులలోకి బయల్దేరారు. తిగళ సమాజానికి చెందినవారు కరగ ఉత్సవాన్ని ప్రత్యేకంగా పాటిస్తారు. బెంగళూరుతోపాటు రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలలో నివసించే వారు బెంగళూరుకు చేరుకున్నారు. తమిళనాడులోని వివిధ ప్రాంతాలనుంచి పెద్ద ఎత్తున తరలివచ్చారు. కరగ చరిత్రలో ఇటీవలి కాలంలో వరుసగా 15ఏళ్లు కరగను అర్చకుడు జ్ఞానేంద్ర మోశారు.

అయితే గతంలో ఎన్నడూలేని విధంగా ప్రభుత్వంపై ధర్మరాయస్వామి ఆలయ కమిటీ అధ్యక్షులు సతీశ్ తీవ్రమైన ఆరోపణలు చేశారు. కరగకు రూ.2కోట్లు ఇస్తామని డీసీఎం డీకే శివకుమార్ ప్రకటించారని ఇప్పటివరకు పైసా కూడా విడుదల చేయలేదని ఆరోపించారు. అర్చకుడు కూడా ఇదే అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. పదిరోజులపాటు జరిగే కరగ ఉత్సవాలకు కనీసం రూ.1.5కోట్లకుపైగానే ఖర్చు అవుతుంది. ఇప్పటివరకు లక్షలాది రూపాయలు వేసుకున్నామన్నారు. ఇదే విషయమై డీసీఎం డీకే శివకుమార్ స్పందించారు. వినతులకు అనుగుణంగా మంజూరు చేశామన్నారు.



విద్యుత్ దీపాల వెలుగులో వెంకటేశ్వర స్వామి



కరగ ఊరేగింపులో పాల్గొన్న భక్తులు



కరగకు కర్పూర హారతి..

ఓ వర్గం కోసం.. హీన రాజకీయాలు

- మైనార్టీల మేలుకే తపిస్తున్న కాంగ్రెస్
- హిందువులకు అన్యాయం చేయడం తగదు
- బీజేపీ అధ్యక్షుడు విజయేంద్ర ఆగ్రహం ⑦



శివమొగ్గలో బీజేపీ నాయకుల నిరసన



హాల్‌టిక్కెట్‌తో తలుపుపై కూర్చున్న గద్ద

పరీక్ష రాద్దామనే..?

బళ్లారి గాంధీనగర్, ఏప్రిల్ 12(ఆంధ్రజ్యోతి): ఎవరైనా ఏమైనా ఎత్తుకుపోతే గద్దలా తన్నుకుపోయారు అంటారు. సదరు సామెతను తలపించేలా ఇక్కడో గద్ద హడావుడి చేసింది. పరీక్షకు హాజరవుతున్న అభర్థి చేతిలో హాల్ టికెట్ ఎత్తుకుపోయి అందరినీ పరుగులు పెట్టించింది. మంగళూరు జిల్లా, కాసరగూడు ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం ఈ దృశ్యం చోటు చేసుకుంది. ప్రభుత్వ శాఖ రాతపరీక్షకు 300మంది అభ్యర్థులు హాజరయ్యారు. పరీక్ష రాయడానికి కేంద్రానికి చేరుకుంటున్న సమయంలో చటుక్కున వచ్చిన గద్ద ఓ అభ్యర్థి చేతిలో హాల్‌టికెట్ లాక్కుని వెళ్లిపోయింది. దీంతో అక్కడ చేరుకున్న అభ్యర్థులు, సిబ్బంది పెద్ద ఎత్తున గుమిగూడి గద్దను అరుపులతో కదిలించే ప్రయత్నం చేసినా.. అది ఏమ్రాతం జంకకుండా అలాగే ఉండిపోయింది. ఎట్టకేలకు కాసేపటి తరువాత కాళ్ళమధ్య పెట్టుకున్న హాల్‌టికెట్‌ను క్రిందకు వదిలి వేసింది. అభ్యర్థి అమ్మయ్య అంటూ... పరీక్ష హాల్‌కు వెళ్లడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. గద్ద చేతిలో ఉన్న హాల్‌టికెట్‌ను లాక్కుపోవడంపై అందరూ ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు.



ధర్మవరం మున్సిపల్ కార్యాలయం

ఏటేటా 15శాతం





మున్సిపాల్టీల్లో మళ్లీ పెరిగిన ఆస్తి పన్ను

- ఈనెల ఒకటో తేదీ నుంచే అమలు
- ఐదేళ్లలో రెట్టింపు
- లబోదిబోమంటున్న పట్టణ ప్రజలు

మున్సిపాల్టీల్లో ఆస్తి పన్ను 15శాతం మళ్లీ పెరిగింది. ఈ పెంచిన పన్ను ఈనెల ఒకటో తేదీ నుంచే అమల్లోకి వచ్చింది. దీంతో జిల్లాలోని పట్టణ ప్రజలపై రూ.కోట్లలో పన్ను భారం పడినట్లు అంచనా. ఆస్తి విలువ ఆధారంగా విధిస్తున్న పన్ను ప్రతి ఏటా పెరుగుతోంది. పట్టణ ప్రాంతాల్లో గృహ యజమానులపై పన్నుల రూపంలో పడుతున్న ఆర్థిక భారం మున్సిపాలిటీలకు కాసుల వర్షం కురిపిస్తోంది. దీనిపై ప్రజలు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

ధర్మవరం, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): గత టీడీపీ ప్రభుత్వ హయాంలో మున్సిపాలిటీల్లో ఉన్న పన్ను విధానాన్ని వైసీపీ ప్రభుత్వం పూర్తిగా మార్చేసింది. గతంలో మార్కెట్ విలువ (రిజిస్ట్రేషన్ విలువ) ఆధారంగా ఆస్తి విలువ, మున్సిపాలిటీల్లో జోన్ల వారీగా రేట్లు నిర్ణయించి పన్ను విధించేవారు. ఈ విధానం 1997 నుంచి అమలు అవుతోంది. భవన నిర్మాణ కొలతలను కూడా పరిగణలోకి తీసుకునేవారు. మున్సిపాలిటీ గెజిట్ ప్రకారం జోన్ల వారీగా పన్ను నిర్ణయించే వారు. గతంలో భవనానికి మాత్రమే పన్ను విధించేవారు. వైసీపీ ప్రభుత్వం వచ్చాక కొత్త విధానంలో భవనంతోపాటు చుట్టూ ఖాళీ వదిలితే ఈ స్థలానికి కూడా పన్ను విధించారు. దీంతో పన్ను అమాంతం పెరిగింది.

ఆస్తి విలువ

ఆధారంగా గతంలో చెల్లిస్తున్న పన్నుకు కొత్త విధానంలో నిర్ణయించిన పన్నుకు మధ్య వ్యత్యాసాన్ని నిర్ధారించారు. తేడా ఉన్న ప్రకారం ఏటా 15శాతం పన్ను పెంచుతూ వస్తున్నారు. ఈ పన్నుల విధానం సరైనది కాదని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోవడంలేదు. ఉదాహరణకు ఓ వ్యక్తి ఇంటికి ఏటా రూ.492 పన్ను చెల్లించే వాడు. దీనికి ఏటా ప్రభుత్వం 15శాతం చొప్పున పెంచేస్తోంది. ఇలా వరుసగా పెరిగిన పన్నుతో ఐదేళ్లకు అది రూ.990కి చేరింది. ఇలా జిల్లాలో అన్ని మున్సిపాలిటీలలో ఇదే స్థాయిలో పన్నులు పెరిగాయి.

50శాతం వడ్డీ రాయితీ అమలు

పన్ను బకాయిదారుల నుంచి వసూలు చేసిన ఆస్తి పన్నుపై ప్రభుత్వం 50శాతం వడ్డీరాయితీని ప్రకటించింది. గత ఆర్థికసంవత్సరంలో ఆస్తి పన్నుపై వడ్డీ చెల్లించిన వారికి దానిలో 50శాతం తిరిగి ఇస్తోంది. అయితే ఈ మొత్తాన్ని ఆ ఆర్థిక సంవత్సరంలోని మొదటి ఆరునెలలకు సంబంధించిన పన్నులో తగ్గించారు. వడ్డీ రాయితీని పన్నుదారులకు తిరిగి చెల్లించినట్లుగా పన్నుదారుల ఖాతాను పరిశీలిస్తే తెలుస్తోంది.



ధర్మవరం పట్టణ ముఖచిత్రం

5శాతం రాయితీ

మున్సిపాలిటీల్లో ఆస్తి పన్నుపై ప్రభుత్వం 5శాతం రాయితీ అమలు చేస్తోంది. ఈ నెలాఖరిలోగా చెల్లిస్తే ఈ రాయితీ వర్తిస్తుందని మున్సిపల్ అధికారులు చెబుతున్నారు. రాయితీపై మున్సిపల్ అధికారులు విస్తృతంగా ప్రచారం నిర్వహిస్తున్నారు. దీంతో ప్రజలు స్వచ్ఛందంగా వచ్చి పన్ను చెల్లిస్తున్నారు.

కొనసాగుతున్న వైసీపీ విధానం

మున్సిపాలిటీల్లో పన్ను విధానాన్ని వైసీపీ ప్రభుత్వం 2020-21లో మార్చేసింది. ఆస్తి విలువ ప్రకారం పన్నును ఏటా 15శాతం పెంచేలా నిర్ణయించింది. ఈ ప్రకారం గత నాలుగేళ్లు పన్ను పెంచుతూ వచ్చింది. అయితే ప్రస్తుత ప్రభుత్వం పన్నుల విధానాన్ని మారుస్తుందని ప్రజలు ఆశించారు. కానీ అలా జరగలేదు. ఈ ప్రభుత్వం కూడా వైసీపీ పన్నుల పెంపు విధానాన్ని కొనసాగించినట్లు తేలింది. ప్రతి ఏటా పన్నుల పెంపుతో నాలుగైదేళ్లలోనే పన్నుల భారం రెట్టింపైంది. ఆస్తి పన్ను విషయంలో వైసీపీ విధానాలనే ఈ ప్రభుత్వం కూడా అమలు చేస్తుండటంతో ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది. పన్నులు పెరిగితే గృహ యజమానులు అద్దెలు పెంచుతున్నారని ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

ఇంటర్ విద్యార్థిని అదృశ్యం

పరిగి, ఏప్రిల్ 12(ఆంధ్రజ్యోతి): స్థానిక కస్తూర్బాగాంధీ విద్యాలయ (కేజీబీవీ)లో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్న విద్యార్థిని శనివారం అదృశ్యమైంది. ఎస్‌ఐ రంగడు తెలిపిన వివరాల మేరకు.. లేపాక్షి మండలం భయన్నపల్లికి చెందిన ఓ విద్యార్థిని పరిగి కేజీబీవీలో మొదటి సంవత్సరం చదువుతోంది. ఇంటర్ పరీక్షా ఫలితాలు శనివారం వెలువడటంతో విద్యార్థిని ఎకనామిక్స్ సబ్జెక్టు తప్పింది. దీంతో మనస్తాపం చెంది కళాశాలలోని బాత్‌రూం గోడ దూకి వెళ్లిపోయింది. హాస్టల్‌లో విద్యార్థిని కనిపించకపోవడంతో సిబ్బంది పరిసర ప్రాంతాల్లో వెతికారు. కనిపించకపోవడంతో కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. కుటుంబ సభ్యులు హాస్టల్ వద్దకు చేరుకుని, ఆరాతీశారు. ఆచూకీ తెలియకపోవడంతో పోలీసులకు ఎస్‌ఓ సువర్ణ భారతి ఫిర్యాదు చేశారు. ఆ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

పంచాయతీ కార్యదర్శుల జిల్లా కమిటీ ఎన్నిక

పుట్టపర్తి రూరల్, ఏప్రిల్ 12(ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీ కార్యదర్శుల జిల్లా కార్యవర్గాన్ని జిల్లా కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో శనివారం ఎన్నుకున్నారు. ఆ సంఘం రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ రామ్మోహన్, ఉపాధ్యక్షుడు శంకర్, ప్రచార కార్యదర్శి ఓంప్రకాష్ అధ్వర్యంలో ఎన్నిక నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడిగా దాదిరెడ్డి విశ్వనాథరెడ్డి, ప్రధాన కార్యదర్శిగా ఈశ్వర్, గౌరవాధ్యక్షుడిగా జైపాల్‌రెడ్డి, కోశాధికారిగా శ్రావణ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతన అధ్యక్షుడు దాదిరెడ్డి విశ్వనాథరెడ్డి మాట్లాడుతూ.. గ్రామపంచాయతీ కార్యదర్శుల సమస్యల పరిష్కారానికి నిరంతర కృషి చేస్తానని ఆయన తెలిపారు.



గ్రామ పంచాయతీ కార్యదర్శుల నూతన కార్యవర్గం

భవితకు భరోసా

- భవిత కేంద్రాలకు ప్రభుత్వ సాయం
- పెండింగ్ నిధుల పంపిణీ
- విభిన్న ప్రతిభావంతులకు ఉపకరణాలు..
- ఉమ్మడిజిల్లాలో 6267 మందికి లబ్ధి



పంపిణీకి సిద్ధంగా ఉన్న ఉపకరణాలు

పుట్టపర్తి రూరల్, ఏప్రిల్ 12(ఆంధ్రజ్యోతి): భవిత కేంద్రాలకు ఊతం ఇచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం చొరవ చూపుతోంది. దీంతో దివ్యాంగుల్లో ఆనందం వ్యక్తం అవుతోంది. ఉమ్మడి జిల్లాలో 63 మండలాలకు గాను 63 భవిత కేంద్రాలున్నాయి. శ్రీసత్యసాయి జిల్లాలో 32 భవిత కేంద్రాల్లో 3215 మంది, అనంతపురం జిల్లా 31 మండలాల్లో 3052 మంది దివ్యాంగ బాలలున్నారు. వీరిలో 1260 మందే భవిత కేంద్రాలకు వస్తున్నట్లు అధికారుల లెక్కలు చెబుతున్నాయి. వీరిలో చాలామంది నిరుపేదలే. ఈనేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం భవిత కేంద్రాల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించింది. దివ్యాంగ బాలలకు చెల్లించాల్సిన అలవెన్సులను వారి తల్లుల ఖాతాల్లోకి జమచేస్తున్నారు. భవిత కేంద్రాల్లో పనిచేస్తున్న సిబ్బందికి సైతం వేతనాలు సక్రమంగా అందుతున్నాయి. బాలలకు అవసరమైన ఉపకరణాల పంపిణీకి ప్రభుత్వం చర్యలు చేపట్టింది.

బాలలకు భత్యం విడుదల

గత ప్రభుత్వం భవిత కేంద్రాలను నిర్వీర్యం చేసి దివ్యాంగులను తీవ్రంగా ఇబ్బంది పెట్టింది. అయితే ప్రస్తుత ప్రభుత్వం గత ఏడాది నవంబరు నెలలోనే దివ్యాంగ బాలలకు రవాణా భత్యం కింద 10నెలలకు ఒక్కో విద్యార్థికి మూడువేలు, పీఎంశ్రీ పాఠశాల దివ్యాంగ బాలికలకు స్టైఫండ్ కింద పదినెలలకు రూ 3వేలు, మిగతా పాఠశాలల్లోని బాలికలకు రూ 2వేలు, సొంతంగా బడికి వెళ్లలేని చిన్నారులకు సహాయకులకు వస్తున్న వారికి ఎస్కార్టు అలవెన్సు రూ.3వేలు చొప్పున మంజూరు చేసింది. అలాగే 2024-25 ఆర్థిక సంవత్సరానికి 1936 మంది విభిన్న ప్రతిభావంతులైన పిల్లలకు ఇందులో నాలుగు రకాల అలవెన్సులకు గాను 58.24లక్షలు వారి వ్యక్తిగత ఖాతాలకు జమ చేసినట్లు కో-ఆర్డినేటర్ ఆనందబాబు తెలిపారు.

ఉపకరణాల పంపిణీ

గత ఏడాది జిల్లాలో ఉచిత వైద్యశిబిరాలు నిర్వహించి అవసరమైన వారికి ఉపకరణాలను తయారు చేయించారు. ఈమేరకు ఈనెల 8న కొత్తచెరువులో 277 మంది దివ్యాంగ విద్యార్థులకు ట్రైసైకిళ్లు 57, సీపీ వీల్‌చైర్‌లు 26, వినికిడి యంత్రాలు 64 టీఎల్‌ఎం (టీచర్‌లెర్నింగ్ మెటీరియల్‌కిట్లు) రోలేటర్లు 44, బ్రెయిలీ కిట్లు 2 ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి చేతులు మీదుగా అందజేశారు.

నేత్రదానం

అనంతపురం టౌన్, ఏప్రిల్12 (ఆంధ్రజ్యోతి): అనంతపురంరూరల్ మండలం చంద్రబాబునగర్‌కు చెందిన రామన్న (80) మరణించడంతో ఆయన కళ్లను కుమారులు దానం చేశారు. రామన్న వయసు రీత్యా సహజమరణం పొందారు. ఆయన కుటుంబసభ్యులను సామాజిక కార్యకర్తలు ఆలంబన జనార్దన్, క్యాటరర్ రామకృష్ణ కలిసి కళ్లదానంచేస్తే మరో ఇద్దరికి చూపు ఇచ్చిన వారవుతారని కోరారు. ఇందుకు రామన్న కుమారులు శ్రీనివాసులు, గోవింద్‌తోపాటు కుటుంబసభ్యులు అంగీకరించారు. దీంతో పాతూరు రెడ్‌క్రాస్‌లో కొత్తగా ఏర్పాటు చేసిన డీవై కుళ్లాయప్ప ఐసెంటర్ డాక్టర్లు.. రామన్న కళ్లను సేకరించారు. రామన్న కుటుంబసభ్యులను డాక్టర్లు, రెడ్‌క్రాస్ ప్రతినిధులు అభినందించారు.



రామన్న కళ్లను దానం చేస్తున్న కుటుంబసభ్యులు



పూర్వ విద్యార్థులతో ఉపాధ్యాయులు

ఏరా.. ఎలా ఉన్నావ్?

పూర్వ విద్యార్థుల కుశల ప్రశ్నలు

పెనుకొండలో పూర్వ విద్యార్థుల సమ్మేళనం

పెనుకొండ, ఏప్రిల్ 12(ఆంధ్రజ్యోతి): ఏరా..! ఎలా ఉన్నావ్? ఎన్నేళ్లయ్యిందిరా చూసి. ఏమ్మా బాగున్నావా? పిల్లలెంతమంది? ఏం చేస్తున్నారు? అంటూ 33ఏళ్ల తరువాత కలిసిన వారంతా కుశల ప్రశ్నలు వేసుకున్నారు. స్థానిక బాలికల ఉన్నత పాఠశాలలో 1991-92 సంవత్సరంలో చదివిన పదో తరగతి విద్యార్థులు సమ్మేళనం శనివారం జరిగింది. మొత్తం 80మంది ఒక్కచోట చేరి పాత జ్ఞాపకాలను నెమరవేసుకుంటూ చిన్న పిల్లల్లా మారిపోయారు. సాయంత్రం వరకు ఆనందంగా గడిపారు. తమకు చదువు చెప్పిన గురువులు జ్యోతిర్మయి, జయలక్ష్మమ్మ, మనోరంజనమ్మ, నాగరాజు, శ్యామలమ్మను ఘనంగా సత్కరించారు. అనంతరం పూర్వ విద్యార్థులు అంతా కలిసి ఓ ట్రస్ట్‌ను ఏర్పాటుచేసి పేద విద్యార్థులు, ఉపాధ్యాయుల వైద్య ఖర్చులకు చేయూతనందించాలని నిర్ణయించారు.

ఊరి బడిని ఉద్ధరిద్దాం


పూర్వవిద్యార్థులు, గ్రామ పెద్దల నిర్ణయం.. ఘనంగా 65వ వార్షికోత్సవం

బెళుగుప్ప, ఏప్రిల్ 12(ఆంధ్రజ్యోతి): మన ఊరి బడిని మనమే బాగు చేసుకుందామని పూర్వవిద్యార్థులు, గ్రామ పెద్దలు ఓ నిర్ణయానికి వచ్చారు. మండల పరిధిలోని దుద్దేకుంట గ్రామ ప్రాథమిక పాఠశాల 65వ వార్షికోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ముందుగా గ్రామ పెద్దలు, పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయుల ఆధ్వర్యంలో జ్యోతి ప్రజ్వలన చేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ ఈ పాఠశాల్లో చదివిన ఆదిమూర్తి డీఎస్పీగా ఎదిగి, పాఠశాల అభివృద్ధికి ఎంతగానో కృషి చేస్తున్నారని తెలిపారు. ఈ పాఠశాలకు క్రీడా సామగ్రి, విద్యా కార్యక్రమాలకు సహాయ, సహకారాలు కూడా అందిస్తున్నారన్నారు. పూర్వ విద్యార్థులు, గ్రామ పెద్దలు మాజీ వైఎస్ ఎంపీపీ తిమ్మప్ప, నాగరాజు, శ్రీనాథ్, ఎర్రిస్వామి, మారుతీ, శ్రీనివాసులు, సిద్ధలతో పాటు మరికొంతమంది కలిసి వార్షికోత్సవానికి అయ్యే ఖర్చును మొత్తం భరించి, పాఠాలు చెప్పిన ఆనాటి గురువులను పెద్ద ఎత్తున సన్మానించారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలతో పాఠశాల ఆవరణలో సందడి నెలకొంది. కార్యక్రమంలో గ్రామ సర్పంచు రత్నమ్మ, రామాంజినేయులు, ఎంఈఓ మల్లారెడ్డి, హెచ్‌ఎం వెంకట సురేష్, ఉపాధ్యాయులు, వజీర్ బాషా, వేణుగోపాల్, సరస్వతి, నల్లపరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న గ్రామ పెద్దలు, పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు

క్షేత్ర స్వాహాయకురాలు..!



ఈ ఫొటోతో ఏడు మస్టర్లను అప్‌లోడ్ చేశారు..

- అవాక్కయ్యేలా అక్రమాలు
- ఒకే ఫొటోతో ఏడు మస్టర్లకు బిల్లులు
- ఒకేరోజు 1,400 మందికి ఉపాధి పని!
- బట్టబయలైన ఫీల్డ్ అసిస్టెంట్ అవినీతి
- ఉన్నతాధికారులు చర్యలు తీసుకునేరా?

నార్పల, ఏప్రిల్12(ఆంధ్రజ్యోతి): ఒక గ్రామ పంచాయతీలో ఒకేరోజు 1,400 మందికి ఉపాధి పని.. ఒకే ఫొటోతో ఏడు మస్టర్లకు బిల్లులు.. ఇవన్నీ నమ్మడానికే విడ్డూరంగా ఉన్నాయి. అయినా.. వాటిని చేశారు.. కాదు, చేసినట్లు చూపించారు.. గ్రామీణ ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న ఓ క్షేత్ర సహాయకురాలు (ఫీల్డ్ అసిస్టెంట్). మండలంలోని ఓ పంచాయతీలో పనిచేస్తున్న క్షేత్ర సహాయకురాలు స్వాహా పర్వానికి తెరలేపారు. అడ్డగోలుగా అక్రమాలకు పాల్పడ్డారు. రాజకీయ అండదండలంతో పేట్రేగిపోతున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. కొందరు మేట్లతో కుమ్మక్కై, ఉపాధి హామీ పనులకు రాకపోయినా వారి పేర్లను పెట్టి లక్షలాది రూపాయలు స్వాహా చేస్తున్నారు. ఇటీవలే ఉపాధిలో అవినీతిని అరికట్టేందుకు కేంద్ర ప్రభుత్వం నేషనల్ మొబైల్ మానిటరింగ్ సిస్టమ్ (ఎన్‌ఎంఎంఎస్)ను ప్రవేశపెట్టింది. అయినా.. ఆ ఫీల్డ్ అసిస్టెంట్ ఖాతరు చేయలేదు. ఆ పంచాయతీ పరిధిలో గత నెల 25 నుంచి నీటి సంరక్షణ కోసం ట్రెంచ్ పనులు చేపట్టారు. వాటికి 21 మంది కూలీలు మాత్రమే హాజరయ్యారు. వారి ఫొటో తీసి 56 మంది హాజరైనట్లు అప్‌లోడ్ చేసి, ఏకంగా 7 మస్టర్లకు బిల్లులు పెట్టారు. ఇలా గతంలో కూడా చేయడంతో ఆ ఫీల్డ్ అసిస్టెంట్‌ను డ్వామా పీడీ గట్టిగా మందలించారు. అయినా తనను ఎవరూ ఏమీ చేయలేరంటూ ఆ ఫీల్డ్ అసిస్టెంట్ ఎదురు సమాధానం చెప్పినట్లు సమాచారం. దీంతో ఆ ఫీల్డ్ అసిస్టెంట్ అక్రమాలపై ఉన్నతాధికారులు విచారణకు ఆదేశించారు.



ఉపాధి కూలీలతో విచారణ చేస్తున్న ఏపీడీ చెన్నకేశవులు (ఫైల్)

అవాక్కైన విచారణాధికారి

మండలంలో ఆ ఫీల్డ్ అసిస్టెంట్ పనిచేస్తున్న పంచాయతీలో ఏపీడీ చెన్నకేశవులు విచారణ చేపట్టారు. ఈనెల 9న 1,400 మంది కూలీలు హాజరైనట్లు ఫొటోలతో మస్టర్లు రూపొందించి, అధికారులకు పంపారు. ఏపీడీ చెన్నకేశవులు ఆ ఫొటోలను పరిశీలించారు. ఇందులో వెయ్యి మందికిపైగా పనులకు రాలేదని గుర్తించారు. ఒకే ఫొటోనే అప్‌లోడ్ చేసినట్లు గుర్తించి అవాక్కయ్యారు. 'ఒక్కరోజే వెయ్యి మందిపైగా పనులకు రాకపోయినా వచ్చినట్లు ఏ ధైర్యంతో పెట్టారనీ, అధికారులు కళ్లకు గంతలు కట్టుకున్నారనుకున్నారా?' అంటూ ఆ ఫీల్డ్ అసిస్టెంట్‌పై ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలిసింది. ఆ ఫీల్డ్ అసిస్టెంట్ అవినీతిపై పూర్తి నివేదిక రూపొందించి, ఉన్నతాధికారులకు పంపినట్లు సమాచారం.

పైసలిస్తేనే పని..

మండలంలోని ఆ పంచాయతీలో పని కల్పించాలంటే మొదట ఆ గ్రూప్ కూలీలు ఒక్కొక్కరు రూ.500 ఇచ్చుకోవాల్సిందేనన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. లేదంటే ఆ వారం మొత్తంగా ఆ గ్రూప్‌కి పనులు పెట్టరని తెలిసింది. ఎవరికైనా జాబ్ కార్డు కావాలంటే ముందుగా వెయ్యి ముట్టజెప్పాల్సిందేనన్న విమర్శలున్నాయి. ఆ ఫీల్డ్ అసిస్టెంట్ అక్రమాలపై టీడీపీ, జనసేన నాయకులు ఆధారాలతో ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోకపోవడం అనుమానాలకు తావిస్తోంది.

ఉన్నతాధికారికే బెదిరింపులు

తన అక్రమాలపై ప్రశ్నించిన అధికారినే ఆ ఫీల్డ్ అసిస్టెంట్ బెదిరించినట్లు తెలిసింది. సెలవులోగానీ, బదిలీపైగానీ వెళ్లిపోవాలనీ, లేదంటే అంతు చూస్తానని తీవ్రస్థాయిలో హెచ్చరించినట్లు సమాచారం. ఫీల్డ్ అసిస్టెంట్‌కు మద్దతుగా వ్యవహరించాలనీ, చూసీచూడనట్లు వ్యవహరించాలని ఆ అధికారికి కొందరు రాజకీయ నాయకులు చెప్పినట్లు తెలిసింది. ఆ ఫీల్డ్ అసిస్టెంట్ అక్రమాలు ఆధారాలతో బట్టబయలైనా ఉన్నతాధికారులు చర్యలు తీసుకుంటారో.. లేదో వేచిచూడాలి.

నేటి ప్రముఖులు


పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కాయ్...

రేడియో అన్నయ్య (జయంతి)



'రేడియో అన్నయ్య'గా పేరొందిన న్యాయపతి రాఘవరావు 1905 ఏప్రిల్ 13న ఒడిశా రాష్ట్రం బెర్హంపూర్‌లో జన్మించారు. బాల సాహిత్యవేత్త. బాలబాలికల శ్రేయస్సు, సాంస్కృతిక వికాసానికి తన జీవితాన్ని అంకితం చేసిన విద్యావేత్త, కళా కోవిదుడు, రచయిత. ఆలిండియో రేడియోలో తెలుగులో చిన్నారులకోసం నిర్వహించిన కార్య క్రమాలు ఎంతో పేరొందాయి. ఆయన సతీమణి కామేశ్వరి 'రేడియో అక్కయ్య'గా రాణించారు. 'బాల' అనే పిల్లల సాహిత్య పుస్తకాన్ని రెండు దశాబ్దాలపాటు విజయవంతంగా నిర్వహించి ఇతర పత్రికలకు స్ఫూర్తిగా నిలిచారు. ఆయన స్థాపించిన ఆంధ్ర బాలానంద సంఘం నేటికీ కొనసాగుతోంది. పూర్తిగా చిన్నారులతో 'బాలానందం' సినిమాను నిర్మించారు. 1984 ఫిబ్రవరి 24న కన్నుమూశారు.

ధూళిపాళ సీతారామశాస్త్రి (వర్ధంతి)



'శకుని' పాత్రతో పేరొందిన ధూళిపాళ సీతారామశాస్త్రి 1922 సెప్టెంబరు 24న గుంటూరు జిల్లా పల్నాడు తాలూకా దాచేపల్లి గ్రామంలో జన్మించారు. తెలుగు నాటకరంగంలోనూ, సినీ రంగంలోనూ తన నటనాప్రతిభతో విశేషంగా రాణించిన నటుడు. ఆయన పేరు చెప్పగానే శ్రీకృష్ణ పాండవీయంలో 'శకుని' పాత్ర కళ్లముందు మెదులుతుంది. అంతగా ఆ పాత్రకు జీవం పోశారు. ప్రత్యేక తరహా వాచకం, హావభావాలతో సీఎస్ఆర్, లింగమూర్తి అంత పేరొందారు. పౌరాణిక, సాంఘికాలతోపాటు 300కుపైగా సినిమాలలో నటించారు. 2001లో కంచి కామకోటి పీఠాధిపతి జయేంద్ర సరస్వతి ద్వారా సన్యాసదీక్ష స్వీకరించి జీవిత చరమాంకంలో శ్రీరామసేవకే అంకితం చేశారు. 2007 ఏప్రిల్ 13న కన్నుమూశారు.

రేపు విద్యార్థులకు ప్రోత్సాహకాలు

బెంగళూరు, ఏప్రిల్ 12(ఆంధ్రజ్యోతి): కర్ణాటక ఆర్యవైశ్యమహాసభ ఆధ్వర్యంలో ఆర్థికంగా వెనుకబడిన ఉన్నతవిద్య చదివేవారికి 200 ల్యాప్‌టాప్‌లను పంపిణీ చేయనున్నట్టు అధ్యక్షులు రవిశంకర్ ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం సాయంత్రం 4 గంటలకు గాంధీనగర్‌లోని ఓ హోటల్‌లో ప్రత్యేక కార్యక్రమం జరగనుందన్నారు. కోటి రూపాయల దాకా విద్యార్థులకు వడ్డీరహిత రుణాలు, వితంతువులు, దివ్యాంగులకు నెలసరి పించన్లు పంపిణీ చేస్తామన్నారు.

యూట్యూబర్ సమీర్‌పై రూ.10కోట్ల పరువునష్టం దావా

బెంగళూరు, ఏప్రిల్ 12(ఆంధ్రజ్యోతి): విద్యార్థిని సౌజన్యమృతికి సంబంధించి కోర్టు ఆదేశాలకు వ్యతిరేకంగా రెండో వీడియోను పోస్టు చేసిన దూతా పేరిట ఉండే యూట్యూబర్ సమీర్ ఎండిపై 10కోట్ల రూపాయల పరువునష్టం దావావేశారు. సౌజన్య వివాదంతో ధర్మస్థళ ఆలయాన్ని లక్ష్యం చేసుకుని వీడియోలు పోస్టు చేయరాదని కోర్టు ఆదేశాలు ఉన్నాయి. వాటిని ఉల్లంఘించి రెండో వీడియోను సమీర్ పోస్ట్ చేశారు. ఈమేరకు ధర్మస్థళ డీ హర్షేంద్రకుమార్, నిశ్చల్ డిలు బెంగళూరు సిటీ సివిల్‌కోర్టులో దావా వేశారు. ఈమేరకు శుక్రవారం విచారణ జరిపిన న్యాయమూర్తి నటరాజ్ వెంటనే సదరు వీడియోలను డిలీట్ చేయాలని ఆదేశించారు.


వీహెచ్‌పీ పదాధికారుల ఎంపిక



నూతన పదాధికారులు

శిడ్లఘట్ట, ఏప్రిల్ 12(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని వేణుగోపాలస్వామి దేవాలయ ఆవరణలో విశ్వ హిందూ పరిషత్ సంఘానికి నూతన పదాధికారులను ఎంపిక చేశారు. తాలూకా అధ్యక్షుడిగా చెలువరాజ్, ఉపాధ్యక్షుడిగా గంగాధర్, కార్యదర్శిగా మహేశ్ మేలూరు, సహకార్యదర్శిగా మల్లేశ్ ఎంపికయ్యారు. ఈ సందర్భంగా శ్రీనాథ్, కిశోర్, రామమూర్తి, జిల్లా కార్యదర్శి బాలకృష్ణ, సహకార్యదర్శి ప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు. నూతన పదాధికారులను ఆత్మీయంగా సత్కరించారు.

శ్రీరామోత్సవానికి ఏర్పాట్లు



బైక్ ర్యాలీ ఇలా...

దొడ్డబళ్ళాపుర, ఏప్రిల్ 12(ఆంధ్రజ్యోతి): హిందువులో సాంస్కృతిక చైతన్యం కల్పించే దిశగా విశ్వ హిందూ పరిషత్, భజరంగ్‌దళ్ సంయుక్త ఆధ్వర్యంలో శ్రీరాముడి శోభాయాత్ర చేపట్టారు. ఇందులో భాగంగా శనివారం బైక్‌ర్యాలీ నిర్వహిం చారు. ర్యాలీకి ఎమ్మెల్యే ధీరజ్ మునిరాజ్ పచ్చజెండా చూపారు. తాలూకా వ్యాప్తంగా ర్యాలీ సాగనుంది. వందలాది మంది హిందూ కార్యకర్తలు పాల్గొని జై శ్రీరామ్ అంటూ నినాదాలు చేశారు. ఆదివారం పట్టణం లోని భగత్‌సింగ్ క్రీడామైదానంలో శ్రీరామోత్సవం నిర్వహించేందుకు ఏర్పాట్లుచేశారు. మాదకద్రవ్యాల నిషేధం, గోవధ నియంత్రణకు అడ్డుగా చట్టాల సవరణ, లవ్ జిహాద్ నిర్మూలన, వక్ఫ్ పేరిట ఆస్తుల కబ్జా, మతమార్పిడి, అక్రమ వలసదారులకు నియంత్రణకు చర్యలు వంటి అంశాలపై పోరాటం చేసేందుకు నిర్ణయాలు తీసుకో నున్నట్టు నిర్వాహకులు ప్రకటించారు.



విజయపుర రథోత్సవంలో కళాకారుల సందడి



ముళబాగిలు ఆలయం వద్ద రథోత్సవంలో భక్తులు



చాకవేలు పురవీధుల్లో రథోత్సవం

జై హనుమాన్..!

- మార్మోగిన హనుమాన్ నామస్మరణ
- పలు ఆలయాల్లో రథోత్సవం

బెంగళూరు, ఏప్రిల్ 12(ఆంధ్రజ్యోతి): చైత్ర పూర్ణిమను పురస్కరించుకుని శనివారం పలు ప్రాంతాలలో హనుమత్ విజయత్సవ కార్యక్రమాలు, ఉత్సవాలు సాగాయి. పలు ఆలయాల్లో విశేషపూజలు, ధార్మిక కైంకర్యాలు నిర్వహించారు.

చాకవేలులో..

చేళూరు: తాలూకాలోని చాకవేలు గ్రామంలో వ్యాస మహర్షి ప్రతిష్ఠించిన వీరాంజనేయస్వామి ఆలయంలో ఏటా చైత్ర పూర్ణిమను పురస్కరించుకుని రథోత్సవం నిర్వహించడం ఆనవాయితీగా ఉంది. అందులో భాగంగా శనివారం నిర్వహించిన బ్రహ్మరథోత్సవంలో వందలాది మంది భక్తులు పాల్గొన్నారు. చుట్టుపక్కల ప్రాంతాల గ్రామస్థులు పెద్దసంఖ్యలో భాగస్వామ్యులయ్యారు. ఆలయ కమిటీ సభ్యులు, గాయత్రిసేవా ట్రస్టు నేతృత్వంలో గౌరీచంద్రశేఖర్ సహకారంతో వడపప్పు, పానకం పంపిణీ చేశారు. చన్నకేశవస్వామి ఆలయం వద్ద అన్నదానం నిర్వహించారు. కాగా గ్రామీణ ప్రాంతాలనుంచి వచ్చిన పలువులు ఎడ్లబండ్లలో పానకం, మజ్జిగ, వడపప్పు పంపిణీ చేయడంతో పాటు కీలక కూడళ్లలో అన్నదానం చేపట్టారు. గ్రామంలో ఎటు చూసినా సందడి వాతావరణం నెలకొంది.

వైభవంగా విఠల నారాయణస్వామి రథోత్సవం..

ముళబాగిలు: ముళబాగిలు పట్టణంలోని పురాణ ప్రసిద్ధ ప్రసన్న విఠలనారాయణస్వామి బ్రహ్మరథోత్సవం శనివారం వేలాదిభక్తుల నడుమ వైభవంగా జరిగింది. ఉదయం మూలవిరాట్టుకు పంచామృతాభిషేకం, ప్రత్యేక పుష్పాలంకరణ చేశారు. సంప్రదాయం ప్రకారం ఉత్సవ మూర్తులకు పూజలు, విశేష పుష్పాలంకరణ అనంతరం రథంపై కొలువుదీర్చారు. మహామంగళారతితో రథోత్సవాన్ని ప్రారంభించారు. వివిధప్రాంతాలనుంచి వచ్చిన భక్తులు రథంపై పూలు, అరటి పండ్లు, మిరియాలు వేసి మొక్కు లు తీర్చుకున్నారు. వివిధ కళా బృందాలు రథోత్సవంలో పాల్గొ న్నాయి. సేవాకర్తల నేతృత్వంలు పానకం, మజ్జిగ, వడపప్పు పంపిణీ చేశారు. అన్న సంతర్పణ నిర్వహించారు. ఆలయ అర్చకులు గోపాలా చార్ నేతృత్వంలో వైఖానస ఆగమశాస్త్రం ప్రకారం పూజాకైంకర్యాలు సాగాయి. ఉపతహసీల్దార్ సుబ్రమణి, నగరసభ కమిషనర్ వీ శ్రీధర్, ఆలయ ధర్మకర్త పీ శ్రీనివాసులు, కార్యాధ్యక్షుడు కే శంకర్, బీజేపీ పట్టణ కార్యదర్శి మైక్ శంకర్, నగరసభ సభ్యులు భారతి సుబ్రమణి, గరడి శంకర్, తాలూకా బ్రాహ్మణసంఘం అధ్యక్షుడు కాఫీపొడి శ్రీనివాస్, కృష్ణానంద మఠం సోమ ణ్ణ, కరవే తాలూకా అధ్యక్షుడు హరీశ్‌గౌడ తదితరులు పాల్గొన్నారు.

పాతపాళ్యలో..

బాగేపల్లి: తాలూకాలోని పాతపాళ్య గ్రామంలో కోదండరామస్వామి బ్రహ్మరథోత్సవం శనివారం వైభవంగా జరిగింది. అర్చకులు రాము, శ్రీనివాస్ నేతృత్వంలో స్వామివారికి అభిషేకం, అర్చన, మహానివేదిన, మహామంగళారతి, పూజా కైంకర్యాలు జరిగాయి. భక్తులు జై శ్రీరామ్ నినాదాల నడుమ రథోత్సవం సాగింది. చుట్టుపక్కల గ్రామాల ప్రజలు రథోత్సవంలో పాల్గొని అరటి పండు, దవనంను రథంపై వేసి మొక్కులు తీర్చుకున్నారు. గ్రామ పెద్దలు చంద్రప్ప కుటుంబీకుల ఆధ్వర్యంలో పానకం, మజ్జిగ, వడపప్పు పంపిణీతోపాటు అన్నసంతర్పణ నిర్వహించారు. అర్చకులు సుబ్బరాయశెట్టి, బాబు, రామకృష్ణప్ప, ప్రసాద్, శ్రీనివాస్, వెంకటేశ్, నారాయణప్ప, సుబ్బరాయప్ప తదితరులు పాల్గొన్నారు.

ఆలంబగిరిలో...

చింతామణి: తాలూకాలోని ఆలంబగిరి గ్రామంలో పురాణ ప్రసిద్ధ కలియుగ లక్ష్మీ వేంకటరమణస్వామి బ్రహ్మరథోత్సవం శనివారం ఘనంగా జరిగింది. భక్తుల గోవింద నామస్మరణ నడుమ రథోత్సవం సాగింది. కైవార నుంచి అలంకరించిన పల్లకీపై సద్గురు తాతయ్య ఉత్సవ మూర్తిని తెచ్చారు. శ్రీకృష్ణుడి గంధోత్సవ విశేష పూజను ఆలయ ధర్మాధికారి డాక్టర్ ఎంఆర్ జయరాం దంపతులు నిర్వహించారు. రథోత్సవంలో భాగంగా రథశాంతి, రథం పూజ, హోమం, పూర్ణాహుతి నిర్వహించారు. గంధోత్సవ సేవ అనంతరం ఆస్థాన సేవ జరిపారు. భక్తులకు పానకం, మజ్జిగ, వడపప్పు పంపిణీ చేశారు.

బూరగమాకలహళ్ళిలో...

తాలూకాలోని ఊలవాడి గ్రామపంచా యతీ పరిధిలోని బూరగమాకలహళ్ళి లో వీరాంజనేయస్వామి సేవా ట్రస్టు ఆధ్వర్యంలో సీతారామలక్ష్మణ్ హనుమాన్ సమేత బ్రహ్మ రథోత్సవం జరిగింది. ఆలయ అర్చకులు శ్రీనివాసాచారి బృందం నేతృత్వంలో సుప్రభాత సేవ, కళశారాధన్, బలి హరణ, మూల విరాట్టుకు వెన్న అలంకరణ, పూలంగి సేవ, ఆస్థాన సేవ, మధ్యాహ్నం రథాంగహోమం అనంతరం బ్రహ్మరథోత్సవాన్ని ప్రారంభించారు. చుట్టుపక్కల ప్రాంతాలకు చెందిన భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.



ఆలంబగిరిలో బ్రహ్మరథోత్సవం



వీరాంజనేయస్వామికి అలంకరణ



దేవనహళ్ళి తాలూకా విజయపురలో నగరేశ్వర స్వామి రథోత్సవం



పాతపాళ్యలో సీతారామలక్ష్మణులు



పాతపాళ్య రథోత్సవంలో భక్తులు



బూరగమాకలహళ్ళిలో భారీ ఆంజనేయస్వామికి అలంకరణ

ఓ వర్గం కోసం.. హీనరాజకీయాలు

బెంగళూరు, ఏప్రిల్ 12(ఆంధ్రజ్యోతి): నిత్యావసర ధరలను పెంచిన రాష్ట్ర ప్రభుత్వం ప్రస్తుతం ఉద్యోగులకు వేతనాలు ఇచ్చేందుకు నిధులు లేని పరిస్థితికి చేరిందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్యే విజయేంద్ర ఆరోపించారు. తీవ్ర వర్షంలోనూ శనివారం జనాక్రోశ యాత్రను శివమొగ్గలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటైన సభలో ఆయన మాట్లాడుతూ సీఎం సిద్దరామయ్య ఓ వర్గంను ఆకట్టుకునేందుకు హీనమైన రాజకీయాలు చేస్తున్నారన్నారు. ప్రభుత్వ పనుల్లో 4శాతం ముస్లింలకు రిజర్వు చేశారన్నారు. ముస్లిం విద్యార్థులు విదేశాలకు వెళ్తే రూ.20లక్షల నుంచి 30లక్షల దాకా ఇస్తారని, అయితే ఇతర వర్గాలకు ఇంతటి సదుపాయం లేదని అన్యాయానికి గురవుతున్నారన్నారు. హిందువులను అవమానించేలా రాజకీయాలు సరికాదన్నారు. తాము ఎన్నికలకోసం పోరాటం చేయడంలేదని, అధికార కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలపై చేస్తున్నామన్నారు. రైతు వ్యతిరేకి, హిందూ వ్యతిరేకిగా ఉన్న ప్రభుత్వాన్ని దించేశక్తి బీజేపీ కార్యకర్తలకు ఉందన్నారు. నిరసనలో బీజేపీ సీనియర్ నేత బీఎస్ యడియూరప్ప, ఎంపీ బీవై రాఘవేంద్ర, ఎంపీలు గోవింద కారజోళ, కోట శ్రీనివాసపూజారి, మాజీ మంత్రి అరగ జ్ఞానేంద్ర, ఎమ్మెల్సీ డీఎస్ అరుణ్, భారతిశెట్టి, డాక్టర్ ధనంజయ్ సర్జి, మాజీ ఎమ్మెల్యే కుమారస్వామి, అశోక్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

బాగేపల్లిలో సంబరంగా ఉరుసు

బాగేపల్లి, ఏప్రిల్ 12(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని అవధూత హజరత్ సయ్యద్ షేక్ హుసేన్‌షా వలి గంధోత్సవం, ఘనంగా ఖవ్వాలి సంబరంగా జరిగింది. హిందూముస్లింలు ఉరుసులో పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. పట్టణంలో 60ఏళ్లక్రితం హుసేన్ షావలి రంజాన్ అనంతరం 11వ రోజు తనువు చాలించారు. పట్టణంలోని షాదిమహల్ రోడ్డులో హుసేన్‌షావలి దర్గాలో ఆయన సమాధి ఉంది. షేక్ హుసేన్‌షావలి తన శిష్యత్వాన్ని తాలూకాలోని సుజ్ఞానంపల్లిలో వాల్మీకి సముదాయానికి చెందిన ఆదినారాయణస్వామి, గుడిబండికు చెందిన అశ్వత్థప్పస్వామికి ఇచ్చారు. నేటికీ వీరి మఠాలలో వారి సమాధుల వద్ద హుసేన్ షావలి భావచిత్రానికి దీపం వెలిగిస్తారు. ఇలా ఇక్కడ గంధోత్సవం హిందూ ముస్లింల భావైక్యతకు నిదర్శనంగా సాగుతోంది. పట్టణంలోని గూళూరు రోడ్డు ముజావర్ ఇస్మాయిల్ షా ఖాద్రి, ఆసిఫ్‌లచే గంధంపూజ నిర్వహించారు. చాదర్ (పూలమాల), సుగంధద్రవ్యాలను సమర్పించారు. దర్గాలో ఫకీర్లు గంధం ప్రార్థన చేశారు. ఎమ్మెల్యే సుబ్బారెడ్డి తదితరులు గంధోత్సవంలో పాల్గొన్నారు. పట్టణంలోని దర్గా ఆవరణలో ఖవ్వాలి కార్యక్రమం సందడిగా సాగింది. హుబ్బళ్ళిలోని ఆఫ్రీన్‌తాజ్, కోలారుకు చెందిన మొహ్మద్ తబ్రేజ్‌లు ఆలపించిన పాటలు సభికులను అలరించాయి. పలువురు ప్రముఖులు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.



గంధోత్సవంలో ముజావర్‌లు

కోరమంగలలో జోయాలుక్కాస్ శాఖ



శాఖను ప్రారంభిస్తున్న మంత్రులు రామలింగారెడ్డి, రహీంఖాన్ తదితరులు

బెంగళూరు, ఏప్రిల్ 12(ఆంధ్రజ్యోతి): వరల్డ్ ఫేవరెట్ జ్యువెలర్‌గా పేరొందిన జోయాలుక్కాస్ సంస్థ శాఖ నగరంలోని కోరమంగలలో ఏర్పాటైంది. రవాణాశాఖ మంత్రి రామలింగారెడ్డి, మునిసిపల్ శాఖ మంత్రి రహీంఖాన్ శనివారం లాంఛనంగా ప్రారంభించారు. ఆభరణాల నాణ్యతలో సంస్థ నిర్వాహకులు ప్రజల విశ్వాసం పొందారని మంత్రులు కొనియాడారు. అదే రీతిన ముందుకు సాగాలన్నారు. కేఎస్ఆర్టీసీ వైస్‌చైర్మన్ మొహ్మద్ రిజ్వాన్ నవాబ్, ఎమ్మార్ ప్రాపర్టీస్ సీఈఓ మొహ్మద్ రిహాన్ నవాబ్, జోయాలుక్కాస్ గ్రూప్ చైర్మన్ జాయ్ ఆలుక్కాస్, జాలీ జాయ్ ఆలుక్కాస్, జాన్‌పాల్ ఆలుక్కాస్, ఆంటోని జోస్, థామస్ మాథ్యూ, ఎల్సా జాయ్ ఆలుక్కాస్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా వసంత శిబిరం

చింతామణి, ఏప్రిల్ 12(ఆంధ్రజ్యోతి): పతంజలి యోగ శిక్షణ సమితి చింతామణిశాఖ ఆధ్వర్యంలో పిల్లలకు యోగాసన, వసంత శిబిరం నిర్వహిస్తు న్నారు. ఇందులో భాగంగా శనివారం అంబాజిదుర్గకు అనుబంధమైన కాడుమల్లేశ్వర కొండను అధిరోహించడం, వివిధ పోటీలు నిర్వహించారు. 200మందికిపైగా విద్యార్థులు సహా యోగాభ్యాసకులు పాల్గొన్నారు. పతంజలి యోగమందిరం నుంచి కాడుమల్లేశ్వర కొండపై ఉన్న ఆలయం వరకు కాలినడకన సాగారు. కొండపై కొంతసేపు యోగా, భజనా కార్యక్రమాలు నిర్వహించారు. పతంజలి యోగశిక్షణామందిరం చింతామణి సంచాలకులు నారాయణప్ప మాట్లాడుతూ.. వేసవి సెలవులను సద్వినియోగం చేసుకునేలా శిబిరం నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ప్రస్తుతం పరీక్షలు ముగిసి సెలవులు ఉండడంతో రాష్ట్రవ్యాప్తంగా వేసవి శిబిరాలు నిర్వహించే ప్రక్రియ చేపట్టామ న్నారు. విద్య, క్రీడలతోపాటు ట్రెక్కింగ్, ఇతరత్రా అంశాలలో రాణించేలా సంస్కారాన్ని పెంచేలా వేసవి శిబిరం ఉంటుందన్నారు. ఈ సందర్భంగా యోగాశిక్షకులు అశ్వత్థణ్ణ, రాజశేఖర్, యాగంటి, శివకుమార్, రామలక్ష్మి, సుబ్బలక్ష్మి, పద్మా తదితరులు పాల్గొన్నారు.

వాత్సల్య ఇల్లు అప్పగింత

దొమ్మసంద్ర, ఏప్రిల్ 12(ఆంధ్రజ్యోతి): ధర్మస్థళ సంస్థ ఆధ్వర్యంలో జ్ఞానవికాస కార్యక్రమం కింద ఆనేకల్ తాలూకా హారగద్దెలో ఒక మహిళకు వాత్సల్య ఇంటిని నిర్మించి అప్పగించారు. సంస్థకు చెందిన ఉమర్, బీడీసీసీ బ్యాంకు డైరెక్టర్ నటరాజ్, గ్రామపంచాయతీ అధ్యక్షుడు గురూజి లాంఛనంగా ఇంటిని ప్రారంభించి అందజేశారు. తాలూకాలో మొత్తం 105మందికిగాను 85మంది కిట్‌లు అందచేశామన్నారు. కార్యక్రమంలో స్థానికులు పాల్గొని సంస్థ కార్యవైఖరిని ప్రశంసించారు. .



ఇంటి అప్పగింతలో సంస్థ పదాధికారులు



తుంగభద్ర నీటి మట్టం : 1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1585.12	1,579.02
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	1223	0
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	1,278	172
నీటి నిల్వ (టీఎంసీలు)	7.40	4.01



మాట్లాడుతున్న మంత్రి శరణ ప్రకాశ్ పాటిల్

తాగునీటి సమస్య పై నిర్లక్ష్యం వహిస్తే

కఠిన చర్యలు

- అధికారులకు మంత్రి శరణ హెచ్చరిక
- తాగునీటి సరఫరా, పశువుల మేతపై సమీక్ష

రాయచూరు, ఏప్రిల్ 12(ఆంధ్రజ్యోతి): వేసవి కాలంలో జిల్లాలో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా అధికారులు అప్రమత్తంగా ఉండాలని రాయచూరు జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి డాక్టర్ శరణ ప్రకాశ్ పాటిల్ సూచించారు. తాగునీటి సరఫరా విషయంలో బాధ్యులు నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. జిల్లాలో తాగునీటి సమస్య పై ఎప్పటికప్పుడు స్పందించి అధికారులకు తగిన దశ-దిశ నిర్దేశం చేసే బాధ్యత జిల్లాధికారి, జడ్పీ సీఈఓలదే నన్నారు. జిల్లాలో తాగునీటి సమస్య పశువుల మేత తదితర అంశాలకు సంబంధించి శనివారం జిల్లాధికారి కార్యాలయంలో అధికారులతో ప్రగతి పరిశీలన సమావేశం నిర్వహించారు సమావేశానికి అధ్యక్షత వహించిన మంత్రి డాక్టర్ శరణ ప్రకాశ్ పాటిల్, మాట్లాడుతూ తాగునీటి శుద్ధీకరణ ప్లాంట్‌లు ఉన్న చోట విద్యుత్ సరఫరాకు అంతరాయం జరుగుతున్నట్లు ఆరోపణలు తలెత్తుతున్న నేపథ్యంలో బాధ్యులైన అధికారుల పై చర్యలు తీసుకోవాలని జిల్లాధికారిని ఆదేశించారు. ఎప్పటికప్పుడు సంబంధిత శాఖల అధికారులతో సమన్వయం చేసుకుంటు తాలూకాల వారిగా పరిస్థితిని సమీక్షిస్తు తాగునీటి ఎద్దడి తలెత్తకుండా వేసవిలో తగిన చర్యలు తీసుకోవాలన్నారు. దీంతో పాటు జిల్లాలో పశువుల మేతకు ఎలాంటి కొరత లేకుండా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ఇందుకు సంబంధించి రైతు సంఘాలు, రైతులు ఇతరత్రా వారితో సంప్రదింపులు జరపాలన్నారు. కాగా సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యేలు తమ తాలూకాల్లో నెలకొన్న తాగునీటి సమస్య గురించి వివరించారు. మస్కి ఎమ్మెల్యే బసనగౌడ తుర్విహాళ్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో జలజీవన్ మిషన్ పనులు 50 శాతం పూర్తికాకపోయిన బిల్లులు చెల్లించారని ఇలా ఎందుకు జరిగిందంటూ అధికారులను నిలదీశారు. ఎక్కడ నీటి సమస్య తలెత్తినా వెంటనే సంబంధిత ప్రాంతానికి చెందిన చెరువుల్లోకి నీటిని మళ్ళించి ప్రజల దాహార్తిని తీర్చేందుకు ఏర్పాట్లు చేస్తామన్నారు. జిల్లాలోని మాన్వి తాలూకాలో తాగునీటి సమస్య భిన్నంగా ఉందని ఆ సమస్యను ఇప్పటికే ముఖ్యమంత్రి దృష్టికి తెచ్చామన్నారు. జలజీవన్ మిషన్ ఇతర జలధార పథకాలు నిష్ప్రయోజంగా మారాయని, జిల్లాలో ఏ తాలూకాలోను ఈ రెండు పథకాలు సక్రమంగా పని చేయడం లేదంటు అధికార పార్టీకి చెందిన ఎమ్మెల్యేలే ఆవేదన వ్యక్తం చేయడం గమనార్హం. నిధులున్నా పనులు చేపట్టడం లేదని కొందరు ఆవేదన వ్యక్తం చేశారు. సమావేశంలో జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలు హంపయ్య నాయక్, బాదర్లి హంపనగౌడ, డా.శివరాజ్ పాటీల్, దద్దల బసనగౌడ, బసనగౌడ తుర్విహాళ్ తదితరులున్నారు.

అంగరంగ వైభవంగా హనుమాన్ జయంతి



అంజనాద్రిలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే గాలి జనార్దన్ రెడ్డి



కంప్లిలో హనుమంతుడు



కుడితినిలో..

కంప్లి, ఏప్రిల్ 12(ఆంధ్రజ్యోతి): హనుమాన్ జయంతి సందర్భంగా శనివారం కిష్కిందలోని ఆంజనేయస్వామి జన్మస్థలం అంజనాద్రి పర్వతం భక్తులతో కిటకిటలాడింది. హనుమాన్ మాలధారులు విశేషంగా తరలివచ్చారు. ఎమ్మెల్యే గాలి జనార్దన్‌రెడ్డి పూజలు పాల్గొని హనుమంతుడకి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ త్వరలోనే ఈ పర్వతానికి రోప్ ఏర్పాటు చేసి చిన్నారులు, వృద్ధులకు సులభంగా స్వామి దర్శనం అయ్యేలా చూస్తామన్నారు. మాలధారులకు ప్రత్యేక ఏర్పాట్లు చేపడ్తామన్నారు. కంప్లి, కురుగోడు, కుడితిని పట్టణాలతో పాటు గ్రామాల్లో జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించుకున్నారు. ఆలయంలో భక్తులకు అన్నప్రసాదాలు అందజేశారు.



సిరుగుప్పలో వెండి ప్రభావళితో పేట ఆంజనేయస్వామి

సిరుగుప్ప: పట్టణంలోని దేశనూరు రోడ్డు మార్గంలో వెలసిన పేటే ఆంజనేయస్వామి ఆలయంలో హనుమాన్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ప్రధాన అర్చకులు శ్యామాచార్య ఆధ్వర్యంలో స్వాముల వారికి పుష్పాలంకార సేవలు, వెండి కవచధారణ, ప్రత్యేక పూజలను నిర్వహించారు. స్వామి వారికి వెండి ప్రభావళిని విరాళంగా అందజేశారు. అనంతరం భక్తులకు అన్నప్రసాదం అందజేశారు. ఈ సందర్భంగా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు.

బళ్లారిరూరల్: నగరంలో హనుమ జయంతి సందర్భంగా పలు ఆలయాల్లో ఆంజనేయస్వామికి విశేష పూజలు, అలంకరణ నిర్వహించారు. స్థానిక వెంకటేష్ నగర్‌లో వెలిసిన అభయ ఆంజనేయస్వామి ప్రత్యేక అలంకరణలో పూజలు నిర్వహించినట్లు ఆలయ కమిటీ అధ్యక్షుడు ధనుంజయ తెలిపారు. బాలాంజనేయస్వామి ఆలయంలో బాలాంజనేయ స్వామికి హనుమ జయంతి సందర్భంగా విశేష పూజలు నిర్వహించినట్లు అర్చకులు రాఘవేంద్ర తెలిపారు. పెద్ద ఎత్తున భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు.

అంబేడ్కర్‌ను ఆదర్శంగా తీసుకోవాలి: ఎమ్మెల్యే



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గణేష్

కంప్లి, ఏప్రిల్ 12(ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ను ఆదర్శంగా తీసుకుని యువత ఆశయాలు సాధించాలని ఎమ్మెల్యే జేఎన్ గణేశ్ పిలుపునిచ్చారు. కురుగోడు పట్టణంలో ఎస్ఎల్‌వీఎస్ హాల్లో పోలీసు శాఖ ఏర్పాటు చేసిన బీఆర్ అంబేడ్కర్ జీవనచరిత్రపై వివిధ అంశాలపై అంబేద్కర్ జయంతి సందర్భంగా పోటీలు నిర్వహించారు. ఈ పోటీలో భారీ సంఖ్యలో పాల్గొన్నారు. గెలిచిన వారికి బహుమతులు అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ విద్యార్థులు విద్యకే పరిమితం కాకుండా స్వాతంత్ర్యం తీసుకువచ్చిన నాయకులు, రాజ్యాంగం తీసుకువచ్చిన నాయకులు విషయాలు తెలుసుకుని ముందడుగు వేస్తే మరింత చదువులో రాణిస్తారన్నారు. తహసీల్దార్ నరసప్ప, డీఎస్పీ ప్రసాద్ గోఖలే, పురసభ ప్రెసిడెంట్ శేకన్న, మల్లికార్జున, సీఐ విశ్వనాథ్, హిరేగౌడ, ఎస్ఐ సుప్రీత్, శాంతమూర్తి, హనుమంతు పాల్గొన్నారు.

మాజీ మంత్రి నాగేంద్రకు సన్మానం



నాగేంద్రను సన్మానిస్తున్న డీఎస్ఎస్ అధ్యక్షురాలు శాంతమ్మ

బళ్లారిరూరల్, ఏప్రిల్ 12(ఆంధ్రజ్యోతి): నగరంలోని నెహ్రూ కాలనీలో మాజీ మంత్రి నాగేంద్రను డీఎస్ఎస్ ఆధ్వర్యంలో ఘనంగా సత్కరిచారు. శనివారం ఆయన నివాసంలో కర్ణాటక దళిత సంఘర్షణ సమితి మహిళా ఘటక రాజ్యాధ్యక్షురాలు శాంతమ్మ, జిల్లా అధ్యక్షురాలు ఎస్ చంద్రకళ నేతృత్వంలో అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో దళిత సంఘర్షణ సమితి సభ్యులు గౌసియా, ఎంపీ కమల, దాక్షాయణి, పుష్ప, మంజు, రాజేశ్వరి, వసంత, రీటా, సుజాత, రేణుక, గోవిందమ్మ తదితరులు పాల్గొన్నారు.

గనుల ప్రభావిత గ్రామాల్లో పునరావాసం శూన్యం

- నీటి ఎద్దడితో విలవిల్లాడుతున్న పలు గ్రామాలు
- కమిటీ నివేదించినా చర్యలు శూన్యం

బళ్లారి సిటీ, ఏప్రిల్ 12(ఆంధ్రజ్యోతి): కోట్లాది రూపాయలు సంపాదించి పెడుతున్న గనులున్నా సమీప గ్రామాలకు పునరావాసం కరువయ్యింది. జస్టిస్ బి.సుదర్శన్ రెడ్డి అధ్యక్షతన జరిగిన కర్ణాటక మైనింగ్ ఎన్విరాన్‌మెంటల్ రిహాబిలిటేషన్ కార్పోరేషన్(కేఎంఈఆర్‌సీ) ఎవర్‌సైట్(ఓఎ) యొక్క 19వ సమావేశం మైనింగ్ ప్రభావిత మండలాల కోసం సమగ్ర పర్యావరణ ప్రణాళిక(సీఈపీఎంజడ్) ఆకాంక్షలను నెరవేర్చడంలో విఫలమయ్యాయి. ఏప్రిల్ 3న జరిగిన సమావేశంలో రూ.1.125కోట్ల విలువైన రోడ్డు, తాగునీరు, మురుగునీటిపారుదల ప్రాజెక్టులకు ఆమోదం లభించింది. సమావేశంలో విద్య,ఆరోగ్య,మహిళలు, పిల్లలు, వ్యవసాయం, నైపుణ్యాభివృద్ధి వంటి ప్రజా కేంద్రీకృత ప్రాజెక్టులకు బదులుగా నిర్మాణ కేంద్రీకృత ప్రాజెక్టులకు మాత్రమే ప్రాధాన్యం ఇచ్చినట్లు సమావేశ కార్యకలాపాలను బట్టి స్పష్టంగా తెలుస్తోంది. మూడు రోజుల పాటు సండూరులో ఉన్న కేఎంఈఆర్‌సీ చీఫ్ అధికారులు, జిల్లాస్థాయి అధికారులు వివిధ ప్రాంతాలను సందర్శించి తనిఖీలు నిర్వహించారు. నర్సింగ్‌పూర్ మరో మూడు గ్రామాలకు తాగునీటిని సరఫరా చేయడానికి రూ.3.55కోట్ల వ్యయంతో కూడిన ప్రాజెక్టుకు సమావేశం ఆమోదం తెలిపింది. అయితే ఆ మూడు గ్రామాల్లో ఏది ప్రొసీడింగ్స్‌లో ఒక్క ప్రస్తావన కూడా లేదు. సండూర్‌లోని గని ప్రభావిత గ్రామాల్లో చాలా వరకు నీరు పారిశుధ్య సమస్యలు తీవ్రంగా ఉన్నాయని సుదర్శన్‌రెడ్డి పేర్కొన్నారు.



సండూర్‌లో గనుల తవ్వకాలు (ఫైల్)



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న అసోసియేషన్ నాయకులు

టోల్ ట్యాక్స్ పెంపుపై 15 నుంచి నిరసన

- జీఎస్టీ పెంపుపై లారీ అసోసియేషన్ సభ్యుల ఆగ్రహం

బళ్లారిరూరల్, ఏప్రిల్ 12(ఆంధ్రజ్యోతి): టోల్ ట్యాక్స్ పెరుగుదలపై 15న నిరసన చేపడ్తున్నట్లు లారీ అసోషియేషన్ ప్రకటించింది. శనివారం నగరంలో విలేకరుల సమావేశంలో అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు మించు శ్రీనివాస్ మాట్లాడారు. డీజిల్ పెరుగుదల, టోల్‌టాక్స్‌ల పెంపును నిరసిస్తూ 15వ తేదీ మంగళవారం ఆందోళన చేపడ్తున్నామన్నారు. ఉదయం బెంగళూరు రోడ్డు సిరికాటా సమీపంలో లారీ అసోసియేషన్ ఆధ్వర్యంలో అధ్యక్షుడు షణ్ముఖప్ప ఆదేశాల మేరకు ధర్నా చేపడ్తామన్నారు. జిల్లాలో దాదాపుగా 600 మంది లారీ యజమానులు ఆందోళనకు మద్దతు తెలుపుతున్నారన్నారు. డీజిల్ పెరుగుదల టోల్ చార్జీలు పెరగడంతో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నామని దీనిని తగ్గించాలని, అదేవిధంగా డీజిల్‌ను జీఎస్టీలో కలపాలని కోరారు. జీఎస్టీ వల్ల లారీ ఓనర్లు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. లారీ యజమానులు అప్పుల పాలయి ఇబ్బంది పడుతున్నారన్నారు. కార్యక్రమంలో నూర్ మహమ్మద్, మహబూబ్ బాషా, పెద్దన్న, బసవరాజు, విశ్వనాథ్, ప్రవీణ్ కుమార్, పూజాదేవి, శ్రీనివాసులు, సంతోష్ నారాయణ, యర్రిస్వామి, సురేష్, తిప్పేష్, భీమన్న, శ్రీనివాస్ శెట్టి దాదా పీర్ నూర్ బాషా లారీ ఓనర్లు తదితరులు పాల్గొన్నారు.

అక్కమహాదేవి.. మహిళలకు ఆదర్శం

- రాష్ట్ర యాక్టివ్ టీచర్స్ ఫోరం జిల్లా అధ్యక్షుడు రవిచెళ్లగుర్కి



అక్కమహాదేవికి నివాళి అర్పిస్తున్న రవి చెళ్లగుర్కి, విద్యార్థులు

బళ్లారి సిటీ, ఏప్రిల్ 12(ఆంధ్రజ్యోతి): శివశరణ అక్కమహాదేవి మహిళా ప్రపంచానికి ఆదర్శం అని కర్ణాటక రాష్ట్ర యాక్టివ్ టీచర్స్ ఫోరం జిల్లా యూనిట్ అధ్యక్షుడు రవిచెళ్లగుర్కి అన్నారు. శనివారం తాలూకాలోని సంజీవరాయనకోట ప్రభుత్వ ఉన్నత ప్రాథమిక పాఠశాలలో నిర్వహించిన శివశరణ అక్కమహాదేవి జయంత్యుత్సవంలో ఆయన మాట్లాడుతూ స్త్రీలు నిస్సహాయులు కాదని, సమర్థులని నిరూపించిన గొప్ప శివ భక్తులు అని అన్నారు. మన ముందు రెండు ఎంపికలు ఉన్నప్పుడు మనం సరైనదాన్ని ఎంచుకుని ఒకదాన్ని వదిలివేయాలి. దీని ప్రకారం అక్కమహాదేవి మందు శివుడు, అమెభర్త అనే రెండు ఎంపికలు ఉన్నప్పుడు ఆమె తన భర్తను విడిచిపెట్టి శివ శ్రీశైల చన్నమల్లికార్జునుడితో కలిసిపోయిందన్నారు. అమ్మాయిలు జీవితంలో ఉన్నత లక్ష్యాలతో చదువుకోవాలి అక్కమహాదేవి ఆదర్శమన్నారు. అక్కమహాదేవి ఐక్యస్థలం,శ్రీశైల ఆనకట్ట గురించిన స్మార్ట్ వీడియోను పిల్లలకు చూపించారు. తదుపరి బాలికలకు మ్యూజికల్ చైర్‌పోటీలు నిర్వహించి గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వైభవంగా శంభులింగేశ్వర స్వామి రథోత్సవం



రథోత్సవంలో పాల్గొన్న భక్తులు



స్వామి మూలవిరాట్

సిరుగుప్ప, ఏప్రిల్ 12(ఆంధ్రజ్యోతి): శంభులింగేశ్వర స్వాముల మహారథోత్సవం శనివారం వైభవంగా జరిగింది. సిరుగుప్ప తాలుకాలోని దేశనూరు రోడ్డు మార్గంలో తుంగభద్ర నది ఒడ్డున వెలసిన ఎంతో చరిత్ర గల శంభులింగేశ్వర మహారథోత్సవం ప్రతి యేడాది చైత్ర పౌర్ణమినాడు జరగడం ఆనవాయితీ. ఆలయ కమిటీ అధ్యక్షుడు ఉంతకల్లు అమరేషప్ప ఆధ్వర్యంలో వేడుకలు ఘనంగా నిర్వహించారు. వేలాది మంది భక్తులు పాల్గొని పూలు, పండ్లు విసిరి మొక్కులు తీర్చుకున్నారు. భక్తులు దర్శనం కోసం బారులుతీరారు. పోలీసులు పటిష్ట బందోబస్తు నిర్వహించారు.

రోడ్డు విస్తరణలో ఇళ్ల తొలగింపు



ఎక్స్‌కవేటర్‌తో ఇళ్లను కూల్చేస్తున్న అధికారులు

కంప్లి, ఏప్రిల్ 12(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఎదురు మసీదు నుంచి జోగి కాలువ వరకు రోడ్డుకు అడ్డంగా, అక్రమంగా నిర్మించిన ఇళ్లను శనివారం పురసభ అధికారులు జేసీబీలతో తొలగించారు. రోడ్డుకు ఇరువైపులా 17-17 అడుగుల వెడల్పుతో రోడ్డుపైకి వచ్చిన ఇళ్లను తొలగిస్తున్నట్లు అధికారులు తెలిపారు. అయితే కొందరు స్థానికులు ఇళ్ల తొలగింపును అడ్డుకున్నారు. పోలీసులు సహకారంతో అధికారులు తొలగింపును కొనసాగించారు. మిగిలి ఉన్న ఎదురు మసీదు నుండి జోగి కాలువ వరకు పనులు ప్రారంభించిన అధికారి తెలిపారు. మొత్తం 60 ఇళ్లను తొలగిస్తున్నట్లు తెలిపారు.

ఆంధ్రజ్యోతి పాఠకులకు బహుమతుల పంపిణీ

బళ్లారి సిటీ,ఏప్రిల్ 12(ఆంధ్రజ్యోతి): ఆంధ్రజ్యోతి పాఠకులకు 22వ వార్షికోత్సవం సందర్భంగా నాలుగు నెలల పాటు లక్కీడ్రా కూపన్లు ప్రచురించిన సంగతి తెలిసిందే. ఇటీవల తీసిన లక్కీడ్రాలో కన్సోలేషన్ విజేతలకు శనివారం ఏసీఓ తిప్పేస్వామి బహుమతులు అందజేశారు. బళ్లారి నగరంలోని విక్రమ్ రాజ్, కుళ్లాయప్ప, సువార్తమ్మ కన్సోలేషన్ బహుమతులు అందుకున్నారు. ఈసందర్భంగా తిప్పేస్వామి మాట్లాడుతూ ఆంధ్రజ్యోతి లక్కీడ్రా నిర్వహించి బహుమతులు అందజేయడం హర్షణీయమన్నారు. ఈ సందర్భంగా పాఠకులు మాట్లాడుతూ నిత్యం ప్రజా సమస్యలపై వార్తలు ప్రచురించడమే కాకుండా బహుమతులు అందజేసి ప్రోత్సహించడం అభినందనీయమన్నారు.



బహుమతులు అందుకుంటున్న సువార్తమ్మ



విక్రమరాజ్



కుళ్లాయప్ప

హోసూరు జోన్

పాఠశాలలో కిటికీ అద్దాలు ధ్వంసం

హోసూరు, ఏప్రిల్ 12(ఆంధ్రజ్యోతి): హోసూరు కామరాజ్ కాలనీలో కార్పొరేషన్ మిడిల్ స్కూల్‌లో తమిళ, ఆంగ్ల మీడియంలలో 1230మంది విద్యార్థులు ఉన్నారు. ఇటీవలే పాఠశాల ప్రహరీగోడ నిర్మాణం చేపట్టారు. ఇంకా పనులు పూర్తి కాలేదు. దీంతో రాత్రి వేళల్లో పాఠశాలలోకి వచ్చి మద్యం సేవించడం ఇతరత్రా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నారు. శుక్రవారం కొంతమంది గుర్తు తెలియని వ్యక్తులు పాఠశాలలోకి చొరబడి కిటికీలు, కుర్చీలను ధ్వంసం చేశారు. ఉపాధ్యాయుల ఫిర్యాదు మేరకు హోసూరు పట్టణ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.



దెబ్బతిన్న కిటికీ అద్దాలు

81 అర్జీల పరిష్కారం

హోసూరు, ఏప్రిల్ 12(ఆంధ్రజ్యోతి): ప్రజాపంపిణీ పథకం కింద నిర్వహించిన ప్రత్యేక ఫిర్యాదుల పరిష్కార శిబిరంలో 81 అర్జీలు పరిష్కారమయ్యాయి. హోసూరు కార్పొరేషన్ 44వ వార్డు పరిధిలోని కన్నూరు ప్రాంతంలో పౌరసరఫరాల పంపిణీ ప్రత్యేక తహసీల్దార్ బాలాజీ నేతృత్వంలో ప్రత్యేక ఫిర్యాదుల పరిష్కార శిబిరం జరిగింది. రేషన్‌కార్డులలో పేర్ల తొలగింపు, చిరునామా మార్పు, ఫోన్ నెంబరు మార్పు వంటి వాటికి అర్జీలు సమర్పించగా అన్నింటినీ పరిష్కరించారు.

ఇరువర్గాల ఘర్షణ

రాయచూరు, ఏప్రిల్ 12(ఆంధ్రజ్యోతి): తాలూకాలోని దేవసుగూరు లేబర్ కాలనీలో శనివారం ఉదయం ఇరు వర్గాల మధ్య ఘర్షణ జరిగింది. చిన్న కారణానికే ఇద్దరు వ్యక్తుల మధ్య మొదలైన జగడం ఇరు వర్గాల మధ్య పరస్పర దాడికి దారి తీసింది. సంచార జాతల వారు నివశిస్తున్న ఈ కాలనీలో వారి పై స్థానికులు దాడి చేశారన్న అవియోగం మేరకు బాధితులు శక్తినగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో రెచ్చిపోయిన ప్రత్యేర్థులు తమ పై పోలీసులకు ఎందుకు ఫిర్యాదు చేశారంటూ మరో సారి దాడికి దిగారు. దీంతో రంగం ప్రవేశం చేసిన పోలీసులు ఇరు వర్గాలను శాంతింప చేశారు. ఇందుకు సంబంధించి బాధితులు పరస్పరం ఇచ్చిన ఫిర్యాదు మేరకు 22 మంది పై కేసులు నమోదు చేసిన శక్తినగర్ పోలీసులు రెండు వర్గాల నుంచి ఐదు మందిని న్యాయస్థానానికి అప్పగించినట్లు తెలిపారు. తీవ్ర దాడులు, అల్లర్లతో కాలనీ వాసులు బెంబేలెత్తారు. పోలీసులు వచ్చి గొడవను సద్దుమణిగేలా చేయడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.

200 స్థానాల్లో గెలుపే లక్ష్యం: మాజీ మంత్రి



కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి బాలకృష్ణారెడ్డి

హోసూరు, ఏప్రిల్ 12(ఆంధ్రజ్యోతి): వచ్చే శాసన సభ ఎన్నికల్లో 200కుపైగా సీట్లు సాధించే లక్ష్యంగా అన్నాడీఎంకే నేతృత్వంలోని కూటమి ఉందని జిల్లా కార్యదర్శి మాజీ మంత్రి బాలకృష్ణారెడ్డి పేర్కొన్నారు. ఆయన అధ్యక్షతన సమావేశం జరిగింది. కృష్ణగిరి పశ్చిమజిల్లా బూత్ కమిటీ ఇన్‌చార్జ్, అమ్మ పెరవై రాష్ట్ర ఉపకార్యదర్శి పన్నీర్‌సెల్వం ముఖ్యులుగా పాల్గొన్నారు. హోసూరు కార్పొరేషన్‌లో చోటు చేసుకున్న అవకతవకలను ఖండిస్తూ ఈనెల 15న నిరసన కార్యక్రమం చేపట్టేలా తీర్మానించారు. బాలకృష్ణారెడ్డి మాట్లాడుతూ.. హోసూరు నగరం ఇటీవల స్వచ్ఛత కొరవడిందన్నారు. సరైన రోడ్లు లేవని, వీధి దీపాలు వెలగడం లేదని, మురుగు కాలువలు శుభ్రం చేయకపోవడంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారన్నారు. సమావేశంలో రాజి, వాసుదేవన్, మంజు, హరీశ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దేవదాసీ వ్యవస్థను నిర్మూలిద్దాం: ఎస్ఐ

కంప్లి, ఏప్రిల్ 12(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో నడుస్తున్న దేవదాసీ వ్యవస్థను నిర్మూలించేందుకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని ఎస్ఐ సుప్రీత్ విరుపాక్షప్ప పిలుపునిచ్చారు. కురుగోడు పోలీస్ స్టేషన్ పరిధిలోని వడ్డట్టి క్రాస్‌లో నివసిస్తున్న ఓ యువతిని దేవదాసిగా మార్చాలని ప్రయత్నించింది. యువతి అదే గ్రామానికి చెందిన పురుషోత్తమ్ అనే యువకుడిని ప్రేమిస్తుంది. ఆ తల్లి ఈప్రేమను అంగీకరించలేదు. తన కుమార్తెను దేవదాసిగా మారమని హింసించింది. విషయం తెలుసుకున్న పోలీసులు వారిద్దరికీ వివాహం చేయడంతో సమస్య పరిష్కారమయ్యింది. మున్సిపల్ ఉపాధ్యక్షులు చన్నపట్న మల్లికార్జున, యల్లాపుర బిలాబాయి, వడ్డట్టి శివకుమార్, రవి, గాదెలింగప్ప, దేవదాసి నాగమ్మ పాల్గొన్నారు.

హాలబావి తండాలో 10 మందికి అస్వస్థత..

రాయచూరు, ఏప్రిల్ 12(ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని లింగసుగూరు తాలూకా గోరేబాళ గ్రామ పంచాయతీ పరిధిలోని హాలబావి తండాలో శనివారం ఉదయం 10 మంది అస్వస్థతకు గురయ్యారు.. ఒక్కసారిగా వాంతులు విరేచనాలు కావడంతో తండా వాసులను సమీపంలోని ఈచనాళ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించి చికిత్సనందిస్తున్నారు. మరికొంత మందికి వికారంగా ఉండడంతో వారికి తాండాలోనే ప్రాథమిక పాఠశాలలో ప్రత్యేక వైద్య శిబిరం ఏర్పాటు చేసి చికిత్స అందజేస్తున్నట్లు తాలూకా వైద్యాధికారి తెలిపారు. వాంతులు విరేచనాలకు నీరు కలుషితం కావడం లేదా ఫుడ్ పాయిజనింగ్ జరగడం వంటి కారణాలు తప్పా ఇతరత్ర ఎలాంటి అనారోగ్య సమస్యలు లేవని వైద్యాధికారులు తెలిపారు. పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నట్లు వారు తెలిపారు. అవసరమైతే తండాలో వైద్య శిబిరం ఏర్పాటు చేసి తండా వాసులందరికి చికిత్సనందించే ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు.